# అల తల వల

అల, తల, వల అంటూ యింట్లో బాబు రణగొణ ధ్వని చేసి చంపుకు తింటున్నాడు. బాబుకు అయిదో ఏడు వెళ్ళి ఆరో ఏడు. కొత్తగా బళ్ళోకి వెళుతున్నాడు. బళ్ళోకి వెళ్ళటం, చదవటం అదీ వాడికి మహోత్సాహాన్ని ఇచ్చింది. దాంతో పాకపీకి పందిరేస్తున్నాడు. నిమిషానికోసారి- అలా తలా వలా అంటూ గోల చేస్తాడు. 'ఏమిట్రా నాన్నా' అని పలుకరిస్తే చాలు చింపిచేటంత మొఖం చేసుకుని, 'పాఠం! నాన్నా పాఠం' అని వచ్చి వాలుతాడు. చెవులు గింగురు మనేటట్లు అలా తలా వలా అంటాడు.

నా గోల పోయి, వాడి అలా తలా వలా గంద్రగోళం నాకు పట్టింది. ఇంక నేను కొత్త నయం, నా పని అయిపోయిందని తేల్చుకుని, కుర్రాళ్ళపని అయినా పట్టించుకున్నాను. నా తరంవాళ్ళు మరీ ఇదైపోయారు. మరెవ్వరన్నా ఏమన్నా చెయ్యాలిసిందే- అని పైకి

అంటారు. పోనీ అల్లాగని, పరుపుచుట్టలాగా పడి ఉంటారా? అదీలేదు. ప్రద్దానికీ తయారు మళ్ళీ. గోళ్ళుకొరుక్కోటం కూడా చాతకాకుండా పిల్లలను తయారుచెయ్యటానికేనా, తగుదుమమ్మా అంటూ వస్తారు.

వచ్చే తరాలవాళ్ళే ఏమన్నా చేస్తే.... మనం, మన జాతి, మన దేశం వీళ్ళమీదే ఆధారపడి ఉంది. శూరులయినా వీళ్ళే వీరులయినా వీళ్ళే. మన సంగతి తేలింది.. మనం భీరులం. వాళ్ళు వీరులు. ఎంత మంది వీరులు తయారైతే అంత మంచిది.

వీరు డంటే—?....

కత్తిపుచ్చుకుని కదనకుతూహల రాగం రైట్ లెఫ్ట్ చిందుల్లో రంగరిస్తూ యుద్ధరంగానికి పోయిన మగాడు. కాటుకపెట్టుకున్న కన్నే—కన్ను. కత్తి చేపట్టినవాడే గండడు. శత్రువును హతాహతం చేసినవాడే వీరుడు. ఆ మాటకొస్తే- ఎదిరించినవాడి డొక్క బద్దల్‌చేసి రాకపోయినా — రంగానికంటూ బయలుదేరినవాడూ వీరుడే. యింకా పొరజూస్తే- కాలూ చెయ్యీ విరగ్గొట్టుకుంటేనేం; కన్నులొట్టబోతేనేం— తీరా అక్కడికి పోయి హరీ అంటూ ప్రాణాలు విడిస్తేనేం— పనిలోకి వెళ్ళిన వాడల్లా వీరుడే. కత్తి పుచ్చుకోకపోయినా— గరిటెను గాండీవంలాగు పుచ్చుకొన్నవాడో? వీరుడే.

వాడూ వీడూ ఏమిటి? గోవులను మళ్ళించినవాడే అర్జునుడు. పనిచేసుకొచ్చిన వాడల్లా వీరుడు!

మేం వీరుళ్ళంత్కాలేకపోయాం. చివరికి గుమాస్తాలమైపోయి, అదీ నిబణకలేక ఉప్పుతోతడిసి ముప్పందుం అనుకున్నాం. మేం కాలేకపోతే కాలేకపోయాం. మా వాళ్ళయినా వీరుళ్ళుకావాలి. కుర్రాళ్ళలో కణకణలాడే ఉత్సాహశక్తిని ఉద్రేకపరచితేచాలు. తగిన చదువూ సంస్కారం ఇస్తే వీరుళ్ళు తయారై కూచుంటారు.

హయ్యోరామ! చదువేనా? పుస్తకం పట్టేప్పటికి అలా తలా వలా అయ్యె అలా తలా వలా అంటేనేచాలు. ఖాయిలా పట్టేట్టవుతోంది. పెద్దవాళ్ళకే యిలాగుంటే— పిల్లలకు ఎలాగుంటుందీ? అందుకే వాళ్ళు క్రమేపీ పాఠ్యపుస్తకంతప్ప మిగతావన్నా చదువుతారు.లేదా అసలే చదువు మానేస్తారు.

ఇంతకీ యీ అలేమిటి, తలెందుకు, వలెందుకు? శుభమస్తు అంటూ చదువు ప్రారంభించటం నిష్ప్రయోజనమైన, ఎన్నడూ కలిసిరాని మాటలతోనా?

అసలెందుకటా ఈపాఠం?

అమ్మ, నాన్న, అత్త, తాత, యిలాంటివి వుంటే—క్రమ క్రమంగా సంఘం, సంఘశాస్త్రం బోధిస్తారు కాబోలు అనుకుందుం.

బడి, పంతులు, సెలవ, యిలాంటివి వుంటే విద్యావిషయకం, తలకెక్కిస్తున్నారనుకుందుం, కనుబొమ్మ లెగరేద్దుం. ఆఫీసు, నౌకర్, చాకిరీ, కూలి, పని, పిండడం, ఎగెయ్యడం, యిలాంటివి వుంటే, కూలీలను తయారుచేస్తున్నారురోయ్ అని సరిపెట్టుకుందుం.

దస్తావేజు, స్టాంపు, నోటు, తణఖా, దావా, డిక్రీ యిలాంటివి వుంటే న్యాయం నూరి పోస్తున్నారురా అని చప్పరిద్దుం. పండగ, పూజ. వ్రతం, చావు, కర్మ, మైల, తద్దినం యిలాంటివన్నా వుంటే మతంరోయ్ అని ఒక్క దణ్ణం పెట్టి ఊరు కుందుం. యిలా, ఏదీకాని అలా తలా వలా ఏమిటి బాబూ?

బాబూ! ఎందుకు నీకీ పాఠం అని కుర్రాణ్ణడిగి ఏం ప్రయోజనం? వీరుళ్ళు కావాలని అనుకుని బళ్ళోకి పంపిస్తే— వీళ్ళూ, మళ్ళీ మాలాగా తయారైతే ఏం లాభం? ఈ వీరుళ్ళను తయారు చేసే ఫ్యాక్టరీకే పోదాం; అక్కడంతా వీరాధివీరులే కదా! పోయా. క్లాసుమేస్టర్ను కద లేశా. ఫ్యాక్టరీ కూలీలాగున్న ఆ మేస్టరు ఏం చెప్తాడు పాపం? ఆయనా

బిక్కచూపులు చూశాడు. నీళ్ళు నములుతూ, 'నాదేముందండీ' చెప్ప మన్నారు, చెప్తున్నా' అన్నాడు. హెడ్‌మాస్టరుగారు గదా అని ఆయన్ని దర్శనం చేస్తే, నావంక ఎగాదిగా చూశాడాయన. నవ్వాడు. అంతే.

"పుస్తకం రాసినాయన్ను కనుక్కోవలసింది. నన్ను అడుగుతావేం? ఎవరిని ఏదడగాలో అన్నా తెలియొద్దూ!" అన్నట్టు చూసి, అట్టహాసంగా నిష్క్రమించాడు. చివరికి ఆ మహానుభావుణ్ణే పట్టుకున్నా. ఆయన అబ్బో— గ్రంథ— కర్త. ఆయనిది ఒక్కటే మంత్రం. ఆయనంటాడు శిలబస్, శిలబస్సయ్యా, శిలబస్సు!

విద్యాశాఖామాత్యులు తప్ప మరొకళ్ళు అడిగితే చెప్పేట్టు లేదని పించింది. పట్నం వెళ్లాల్సిన పనిబట్టి, పనిలోపని, వాళ్ళనూ కదలేశాను. మూడోకాలంలో తప్ప మరెవ్వరూ మాట్లాడలేదు. రిటైరైన ఆఫీసరు గదా అని ఓ ఆసామిని కలుసుకున్నాను. మనవిచేశాను. మా పిల్లలగతి ఇదేనా అన్నాను. ఎందుకీ అలా, తలా, వలా అన్నా. జాతి ధ్వంస మవుతోం దన్నా. జాతి, వీరులు కావలసిన జాతి ఇలా అయితే ఎలా అని అంతా వెళ్ళబోశా.

ఆ అడిగిన ఆఫీసర్ నవ్వాడు. అమావాస్యనాడు రాత్రి సముద్రం అల్లా నవ్వగలదు. ఆయన చెప్పింది నా భాషలో మార్చి చూసు కుంటే——ఇదీ.

"హరి తెలివి తక్కువ పెద్దమ్మా! యిది కూడా తెలీలేదట్రా నీకు. అవున్లే, తెలుగువాడివి ఎలా తెలుస్తుందిరా నాయ్నా? చూస్కోరా, ఇది మొదటి పాఠం. జన్మంతా గుర్తుండాల్సింది. కామారప్పు జీడిలాగు పట్టుకోవాలిసింది, అవునా? ముందు 'అల' రా నాయినా, అల అదే మన కొంపదీసింది. అక్కడ చాతకాకే మనం ఎక్కడా చాతకాలేదు. దాన్ని స్వారీ చేసినవాళ్ళే మనల్నీ స్వారీ చేశారు. అల ఎంత చిన్నమాట. ముందు దీని సంగతి పట్టించుకోవాలి జాగ్రర్త ఇది మర్చిపోకు, పోతివా, తలకు ముప్పొం వస్తుంది. అది కాస్తా వలలో పడుతుంది. అలా

జాగర్త చేస్తివో తల నిలబడి ఎదిరి వాడికి, ఆ అలమీంచి వొచ్చిన వాడికి వల వేస్తుంది. ఇంతకంటె ఏం చెప్పాలా నాయనా. ఇక ప్రస్తుత స్థితి తల, అలకూ వలకూ మధ్యన ఉంది అవునా! ఏం, ఏమంటావు?

నిర్ఘాంతపోయి, యిదా? అన్నా.

"ఏం చూశా వప్పుడే, యింకా ఉంది. అక్షరాలు కలుపుకుంటూ విడగొట్టుకుంటూ పో. అల. అంత. అలతలవల. దీన్ని తప్పించుకోవాలి" కిటుకు యిందులోనే ఉంది. యీ కాస్తలో 'ల' కారం ముమ్మాట్టు నొక్కి వక్కాణించ బడింది. జాగ్రర్తరోయ్. లకారమన్నా లేందే ఏం చెయ్యలేవు అని కాదట్రా అర్థం? అందుకే చూడూ, లకారాన్ని ఎక్కడి కక్కడికే ముమ్మాట్టూ ముక్తాయింపు కొట్టడం!

చివర వల తలకాయ ఉపయోగించి, వలపన్ని అయినా, లంచంగానన్నా 'ల' కారం సంపాయించరో అని అర్థం: అసలు నీవు, యిల్లు కదిలి, ఎక్కడికన్నా అఘోరించావా, ఏమన్నానా? కదిలిచూడు, ఎక్కడికెళతావ్, నేలమీద ఏడవకు. అల జ్ఞాపకం పెట్టుకో, తల కాపాడుకో, వలలో పడకు."

'చాలా' అన్నట్లు చూశాడు.

చెయ్యెత్తి దణ్ణం పెట్టాను. "మహానుభావా, యింత అర్థ కల్పన చేశారు. దివాన్‌గిరీ చెలాయించ వలసిన వారండీ" అన్నా.

ఆయనా తగ్గట్టు నవ్వుతూ, గిరీశం గారన్నట్టు, పూజా పున స్కారాలు లేక బూజెక్కన్నాను గానీ, లేకుంటే గ్లాడ్‌స్టన్‌లాగ దివాన్గిరీ చెలాయించనుటోయ్, అన్నవాడై, "రిటైరై కూచున్నాను. ఏం తోచటం లేదు. ఏదన్నా ఉద్యోగం ఇప్పిద్దూ"— అన్నాడు. ఆ ఇది చూస్తే ఎక్కడ వెంటబడతాడో అనిపించింది.